సమీక్షలు :

ఆంధ్రుల చరిత్ర - సంస్కృతి - 1

మనదేశ చరిత్రకు సంబంధించి శాస్త్రీయమయిన సైద్ధాంతిక పరిశోధన గత 25 సంవత్సరాలుగా మాత్రమే జరుగుతోందని చెప్పవచ్చు. అంతకు ముందు విషయ సేకరణ విస్తృతంగా జరిగింది, ఎంతోమంది ఎంతో శ్రమించారు, కాని వ్యాఖ్యానంలో మాత్రం శాస్త్రీయత స్థానాన, అసందర్భమయిన 'దేశభక్తి', అసహ్యకరమయిన మతోన్మాదం, అశాస్త్రీయమయిన జడాత్మక పిడివాదం (మార్క్సిజం లేబెల్ అంటించుకున్నది) రాజ్యంచేసాయి. గత 25 సంవత్సరాలుగా, డి. డి. కోశాంబితో ప్రారంభమయి ఇర్ఫాన్ హబీబ్ వరకు, సైద్ధాంతిక వ్యాఖ్యానానికి బలమయిన శాస్త్రీయ భూమికను ఏర్పరచారు. ఈ పుస్తకం ఆ ఒరవడిలోనిదే. రచయిత సత్యనారాయణగారి మీద కోశాంబి ప్రభావం స్పష్టంగా కనబడుతుంది. అయితే కోశాంబి చూపినమార్గాన పురోగమించారా అంటే అనుమానమే. చాలవరకు కోశాంబిని అనుసరించారు. ఒకటి రెండు చోట్ల (ఉదాహరణకు "ప్రాచ్యసమాజం" అనే భావనకు సంబంధించి) కోశాంబి కంటే రెండడుగులు వెనక్కి వేసారు.

మన దేశంలో వచ్చిన మొదటి సామాజిక విప్లవం ఆర్యులు తెచ్చింది. మన దేశానికి వచ్చినప్పుడు వాళ్ల పశుపోషకులే అయినా, ఆహార సేకరణ పోడువ్యవసాయాల స్థానాన స్థిరవ్యవసాయాన్ని, ఇనపనాగలినీ, అడవిప్రాంతాలను వ్యవసాయ యోగ్యంగా చదునుచేయడంకోసం ఇతర ఇనప పనిముట్లను, ప్రవేశపెట్టడం, స్థిరవ్యసాయం మీద ఆధారపడ్డ వ్యావసాయిక వర్గసమాజానికి పునాదివేయడం, ఆర్యులుసాధించింది. ఇది ఉత్తరాన ప్రారంభమయి క్రమంగా దక్షిణానికీ తూర్పుకూ విస్తరించింది. ఆంధ్ర ప్రాంతంలో ఈ వ్యావసాయిక వర్గసమాజపు మొట్టమొదటి స్పష్టమయిన రాజకీయ రూపం శాతవాహన సామ్రాజ్యం.

స్థిర వ్యవసాయంలో ఉత్పాదకత పెరుగుతుంది కాబట్టి అదనపు ఉత్పత్తితోబాటే వ్యవసాయేతర సరుకుల ఉత్పత్తిగూడ సాధ్యమవుతుంది. అంటే శ్రమవిభజన, వస్తుమార్పిడీ ముందుకువస్తాయి. ఈ చారిత్రిక సన్నివేశంలో మనకు ప్రపంచంలో అన్ని దేశాల చరిత్రలోను ఒక వింతకనబడుతుంది: అపారమయిన అమ్మకపుసరుకుల ఉత్పత్తి, మారకం, రోమ్‌నుండి భరుకచ్ఛంవరకు, మచిలీపట్నంనుండి చైనావరకు పట్టువస్త్రాలు, ఆభరణాలు, సుగంధద్రవ్యాలు, చందనం, ఇత్యాది విలాసవస్తువుల నుండి, నూలుబట్టలు నెయ్యి నూనెలదాక అన్నీ ఎగుమతిఅయ్యేవి, దిగుమతిఅయ్యేవి

(పేజీ108). ఇది వర్గసమాజపు శైశవడాంబికం. పుట్టగానే పెట్టుబడిదారీ సమాజమనుకుంటుంది కాబోలు, ఎడాపెడా సరుకులనుత్పత్తిచేస్తుంది, మారకంచేస్తుంది, సముద్రయానానికి సంబంధించి తనకున్న మిడిమిడిజ్ఞానంతోనే 'సప్తసముద్రాల'నూ కాకపోయినా అందుబాటులో ఉన్న సముద్రాలనన్నింటినీ చుట్టివస్తుంది.

కాని ఈ డాంబికం చాలకాలంనిలవదు. తానింకా వ్యావసాయిక సమాజమేననీ, తనకు పునాది వ్యవసాయమేననీ, ఆ వ్యవసాయరంగాన్ని బలంగా దిద్దుకోవడం, వ్యవసాయదారుల అవసరాలకు ప్రాధాన్యతనివ్వడం, ఇప్పటిఅవసరమనీ గుర్తిస్తుంది. వ్యవసాయేతర ఉత్పత్తి గూడ వ్యవసాయానికి అనుబంధంగా సాగాలని, అంతే కావలసింది స్వర్ణకారులూ ఆభరణకారులూకాదు, కమ్మరీ కుమ్మరీ వడ్రంగీననీ గుర్తిస్తుంది. దానితో అన్నిదేశాలలోను, స్వయంపోషక గ్రామాలుఏర్పడినా ఏర్పడకపోయినా, వ్యవసాయాన్ని పునాదిగానేకాక కేంద్రంగాగూడగల ఆర్థికవ్యవస్థ రూపొందుతుంది. ఏదో ఒకతరహా ఫ్యూడలిజానికి దారితీస్తుంది. పైపై పరిశీలకులకు ఇది తిరోగమనంగా కనిపించవచ్చు. "చీకటియుగం ఆరంభమయిం"దనిపించవచ్చు. ఒకప్పుడు స్వేచ్ఛగా దేశదేశాలు తిరిగినమనిషి గ్రామానికి బందీ అయిపోయాడనిపించవచ్చు. ఈ చరిత్ర దశలో "ఆంధ్రుడు ఊబిలో దిగబడ్డాడనేచెప్పాలి.... పురోహితవర్గం పెద్దరికంతో వున్న సమాజం అతనిజీవితాన్ని స్వయం సంపూర్ణగ్రామంలో మూసిపెట్టివుంచి"ందనిపించింది సత్యనారాయణ గారికిగూడ (పేజీ 192) కాని ఇది ఆవశ్యమయిన పరిణామం, పురోహితుల కుట్రకాదు. పెట్టుబడిదారీ సమాజం రాకముందు విస్తృతమయిన వ్యవసాయేతర సరుకుల ఉత్పత్తి, మారకం, సాధ్యంకావాలంటే, వ్యవసాయదారుడి అవసరాలను పూర్తిగా విస్మరించి అతన్ని అత్యధికంగా పీడించాలి. యూరప్‌లోలాగ అతను అన్నిదేశాలలోను బానిసకానవసరంలేదు. కాని బానిసకానంతమాత్రాన ఈ సుగంధద్రవ్యాల ఎగుమతిచాటునవున్న అమానుషత్వం తక్కువదికాదు. వ్యవసాయం ప్రధానమయిన సమాజంలో వ్యవసాయేతర ఉత్పత్తికిగూడా వ్యవసాయరంగాన్నే కేంద్రంగామలచడం ఫ్యూడలిజంయొక్క మౌలికమయిన అభ్యుదయకత్వం. తరువాతి కాలంలో అదే విపరీతమయిన మతమౌఢ్యానికి దారితీసిందన్నది వేరేవిషయం.

మరయితే ఈ శాతవాహనకాలంనాటి ఆర్థికవ్యవస్థ ఎట్లాంటిది? సత్యనారాయణ గారి అభిప్రాయంలో అది బానిసవ్యవస్థకాదు, ఫ్యూడల్ వ్యవస్థాకాదు, "ఫ్యూడల్ పూర్వదశ" (పేజీ 176). ఉత్పత్తిదారులయిన శూద్రులు ఒక వర్గంగా దోచుకోబడ్డారేగాని బానిసలుగా కాదు. విస్తృతమయిన అమ్మకపు సరుకుల ఉత్పత్తి ఉండడంచేత

ఫ్యూడల్ వ్యవస్థ కాదు. ఉత్తర భారత చరిత్రలో శాతవాహనుల కాలాన్ని పోలిన మౌర్యుల కాలానికి సంబంధించి కోశాంబి మార్గదర్శకత్వాన్ని అనుసరించే చరిత్రకారులకు దాదాపుగా ఈ అభిప్రాయమే వున్నట్లుంది.

ఈ "ఫ్యూడల్ పూర్వదశ" అనంతరం, ఆహారపదార్థాల ఉత్పత్తి తగ్గి (తలసరిగా) వ్యవసాయేతర ఉత్పత్తికి గూడ గ్రామమే కేంద్రమయింది. పైన వివరించినట్లు ఈ పరిణామం ఆవశ్యమయినది, మౌలికంగా అభ్యుదయకరమయినది. అయితే ఈ గ్రామీణస్వయం పోషకత్వం ఎప్పుడూ సాపేక్షికమే కోశాంబి అన్నట్లు, ఉప్పు ఇనుము లాంటి అత్యవసర వస్తువులు అన్ని గ్రామాలలోను దొరకవు కాబట్టి అటువంటి సరుకుల మారకం ఎప్పుడూవుంటుంది. అంతే కాకుండ రాజులకూ రాజవంశీకులకూ సామంతులకూ దర్బారీ జనానికీ కావలసిన విలాసవస్తువుల ఉత్పత్తి పట్టణాలలో సాగుతూనేవస్తుంది. ఇన్ని మినహాయింపులున్నప్పటికీ గ్రామీణ స్వయంపోషకత్వం వాస్తవికమయిన భావనే. రాజకీయంగా ఈ కాలం ఇక్ష్వాకులనుండి పల్లవులవరకు విస్తరించినది (క్రీ. శ. 3వ శతాబ్దం వరకు) దీనిని సత్యనారాయణగారు "ప్రాచ్య సమాజం పరిధిలో ఫ్యూడలిజానికి పునాదులు పడ్డదశ" అన్నారు (పీఠిక, పేజీ 8) ఈ "దశ"కు సంబంధించి సత్యనారాయణగారు ఇచ్చిన వర్ణననుబట్టి చూస్తే ఇది దాదాపుగా కోశాంబి Feudalism from above అని వర్ణించిన క్రీస్తుశకం మొదటి శతాబ్దాల ఉత్తరభారత సమాజాన్ని పోలివుంది. ఉత్పత్తిదారులయిన రైతులశ్రమను శిస్తురూపంలో సామంతప్రభువులు, వారిపైనున్న రాజులు మహారాజులు, చేజిక్కించుకున్న దశయిది.[1] దీనిని తెలుగులో "సామంత స్వామ్యం" అనవచ్చు

ఈ దశలోనే తరువాతిదశకు బీజాలుఏర్పడ్డాయి గ్రామీణప్రాంతాలలో భూమిలో స్వంతహక్కు, ఇతర ఫ్యూడల్‌సౌకర్యాలున్న భూస్వాములు తలెత్తడం మొదలయింది. బ్రాహ్మణులకు అగ్రహారాలు దానంచేయడంతో ఇది ప్రారంభమయి, సైన్యాధిపతులకు జాగీర్లివ్వడంతోను, గ్రామాధికార్లకు జీతాలకుబదులు భూములు ఇవ్వడంతోను, విస్తరించింది రాష్ట్రకూట చాళుక్యుల కాలంలో (ఏడవశతాబ్దం తదువాతికాలంలో ఈమార్పు వేగంపుంజుకుని కోశాంబిచెప్పిన Feudalism from below అనేదశకు దారితీసింది. దీన్ని తెలుగులో "గ్రామీణభూస్వామ్యం" అనవచ్చు. సత్యనారాయణగారు "ప్రాచ్యసమాజం పరిధిలో ఫ్యూడలిజం ఆవిర్భావం, అభివృద్ధిని తెలియజేసేదశ" అన్నారు.

ఈ రెండుదశలకు సంబంధించి రచయిత కోశాంబితో నిర్హేతుకంగా విభేదించినట్లుంది. కోశాంబిచేసిన నామకరణం అంత సంతృప్తికరం లేనిమాట వాస్తవమే,

ముఖ్యంగా Feudalism from above అనేభావన ఉత్పత్తి సంబంధాలను స్పష్టంగా నిర్వచించదు. అయినా "ప్రాచ్యసమాజం" అనేభావన మరీ అసంతృప్తికరం. ప్రాచ్య దేశాలలో (అంటే ఆసియా ఆఫ్రికాదేశాలలో) ఫ్యూడలిజంబదులు ఒకప్రత్యేకమయిన ఉత్పత్తి విధానంవుండేదని మార్క్స్ భావించాడు. దానిని "ప్రాచ్యఉత్పత్తి విధానం" (Asiatic made of production) అన్నాడు. దీనిముఖ్యలక్షణాలు : (i) భూమి మీద ఎవ్వరికీ స్వంతహక్కు లేకపోవడం (ii) వ్యవసాయానికి అవసరమయిన నీటి పారుదల వసతులను (చెరువులు, కాలువలు) కేంద్రప్రభుత్వం నిర్వహించడం (iii) తత్పర్యవసానమయిన కేంద్రీకృతరాజ్యాంగం, లేక "ప్రాచ్య నిరంకుశత్వం" (vi) గ్రామీణ స్వయంపోషకత్వం. వీటిలో మొదటిమూడు పరిశోధనలకు నిలవ్వు. చాల ప్రాచీనకాలంనుండిగూడ రాజులు సన్నిహితులకు, బ్రాహ్మణులకు, బౌద్ధవిహారాలకు ఇనాంలు ఇవ్వడంజరిగింది. దక్షిణాన శాతవాహనుల కాలంలోనే ఇనాంలు ఇచ్చిన ఆధారాలున్నాయి. ఈ ఇనాందార్లకూ జాగీర్దార్లకేకాకుండ మధ్యయుగాలనాటికి రైతులకుగూడ కొలసందర్భాలలో భూమిమీద స్వంతహక్కుండేదని ఇర్ఫాన్ హబీబ్ చూపించాడు. నీటిపారుదల వసతుల నిర్వహణగూడ ఎన్నడూ కేంద్రీకృతంగా వుండ లేదు. గ్రామసమితులు సామంతులు నిర్వహించేవారు. ఇక ప్రాచ్యనిరంకుశత్వం మాటకొస్తే, 'అప్రాచ్య' నిరంకుశత్వం దానికెన్నడూ తీసిపోలేదు. అసలు ఈ సూత్రీకరణలకు దేనికీ మార్క్స్ ఎంగెల్స్‌లకు అందుబాటులోవున్న రచనలలోగూడ ఆధారంలేదని నయీద్‌నక్వీ వివరంగా వాదించాడు 2 ఇంక ప్రాచ్యసమాజం'లో మిగిలిందేమిటి ? గ్రామీణ స్వయంపోషకత్వం మాత్రమే. అందుకేకాబోలు సత్య నారాయణగారు దీనినే ప్రాచ్యసమాజం నిర్వచనంగా అంగీకరించారు. అయితే గ్రామీణ స్వయంపోషకత్వం శ్రమవిభజన తాలూకు ఒకరూపం అవుతుందేగాని ఉత్పత్తిసంబంధం కాజాలదు. కాబట్టి ఒకఉత్పత్తి విధానానికి నిర్వచనంగా దానిని తీసుకోవడంతప్పు. పైగా మార్క్స్‌గూడా ప్రాచ్య ఉత్పత్తివిధానం అనేమాటను స్వయంపోషక గ్రామీణవ్యవస్థ అనేఅర్థంలో వాడాడవడంతప్పు (పీఠిక, పేజీ 9) మార్క్స్‌భావనలో పైనచెప్పిన నాలుగుఅంశాలూ వున్నాయి. వాటన్నింటిలోనికీ మార్క్స్ నీటిపారుదలవసతుల కేంద్రీకృత నిర్వహణకు, భూమిలో స్వంతఆస్తి లేకపోవడానికి, కీలకస్థానం యిచ్చినట్లు అనిపిస్తుంది.

పుస్తకంలో మరొక ముఖ్యమయిన లోపం వుంది. ఆంధ్ర ప్రాంతానికి సంబంధించిన ప్రత్యేకమయిన చారిత్రిక సంఘటనలను వివరించడానికి రచయిత చేయదగ్గ ప్రయత్నం చేయలేదు. బౌద్ధంలో మహాయాన పంథారావడం, తరువాత

బౌద్ధం క్షీణించిపోవడం, దాని స్థానంలో వైదికమతం విస్తరించడం, ఆటుతరువాత వైదికమతం పరిధిలోనే శైవవైష్ణవ ఉద్యమాలు రావడం, శాతవాహనుల తరువాతి ఆంధ్రచరిత్రలో ముఖ్యఘట్టాలు. వీటిలో బౌద్ధంస్థానాన వైదికమతం ప్రబలమయిన ఘట్టాన్ని మాత్రం కొంతవరకు వివరించారు. వ్యవసాయ ఉత్పత్తికీ వాణిజ్యానికీ అవరోధమయిన పశుపోషక సమాజపు వైదికకర్మకాండను వ్యతిరేకించిన బౌద్ధమతం, వాణిజ్యానికీ వాణిజ్యవిస్తరణకూ మరీ సన్నిహితమయిపోయిన కారణాన స్వయం పోషక గ్రామీణ వ్యవస్థ ఆవిర్భవించడంతో తన సామాజిక పాత్రను కోల్పోయింది. అయితే బౌద్ధమతం ఈ కొత్త పరిస్థితుల కనుగుణంగా తన రూపాన్ని ఎందుకు మార్చు కోలేకపోయింది? చైనానుండి శ్రీలంక వరకు భూస్వామ్య సమాజాల భావజాలమయిన బౌద్ధం మనదేశంలో మాత్రం ఆ పాత్ర నిర్వహించడంలో హిందూమతం ముందు ఎందుకు ఓడిపోవలసివచ్చింది? మనదేశం భూస్వామ్య సమాజవ్యాప్తిలో వైదికమతానికి పునాది అయిన వర్ణవ్యవస్థకుగల కీలకమయిన పాత్రను గురించి కోశాంబి వివిధ సందర్భాలలో చెప్పిన విషయాలలో దీనికి సమాధానం లభించవచ్చు. అటువంటి సమాధానం సంపాదించడానికి ఆంధ్ర చరిత్ర చాల అనుకూలమయిన సందర్భం, ఎందుచేతనంటే ఒకప్పుడు ఇక్కడ బౌద్ధం చాల వ్యాప్తిని కలిగివుండి, తరువాతికాలంలో సంపూర్ణంగా పెకలించివేయబడింది. కాని అటువంటి ప్రయత్నం సత్యనారాయణ గారు చేయలేదు. అలాగే మహాయానం పుట్టుకకు, శైవవైష్ణవ ఉద్యమాల పుట్టుకకు గల మౌలికమయిన కారణాలను సంతృప్తికరంగా వివరించేప్రయత్నమూచేయలేదు. ముఖ్యంగా ఈ చివరి ఘట్టానికి సంబంధించి "భక్తి ఉద్యమం పురోహితవర్గంవారి ఆశల్నీ ఆశయాల్నీ కాక ప్రజాసామాన్యం యొక్క అభిమానాల్నీ ఆశయాల్నీ వ్యక్తం చేస్తుంది" అని రచయిత చేసిన వ్యాఖ్యానం (పేజీ 232) బొత్తిగా ఫ్యూడల్ పండితుల వ్యాఖ్యలాగావుంది ("జ్ఞానమార్గం మేధావులకూ భక్తిమార్గం ప్రజాసామాన్యానికీ" అన్నదే గదా ఫ్యూడల్ పండితుల మతం).

నిజానికి ఇది ఆంధ్రుల చరిత్ర కాదు. మన దేశంలో అన్ని ప్రాంతాల చరిత్రకూ (స్థూలంగా) సామాన్యమయిన పరిణామక్రమానికి ఆంధ్రప్రాంతాన్ని ఒక ఉదాహరణగా తీసుకొని ఇచ్చిన వివరణ. కోశాంబి, ఆర్. ఎస్. శర్మల రచనలతో పరిచయంవున్న వారికి ఇందులో స్థానిక వివరాలు మినహాయించి కొత్త విషయాలేవీ కన్పించవు. అయితే విపులంగా రాసిన కారణాన ఇది అంత మేరకు ఉపయోగకర మయిన పుస్తకమే. తెలుగువాడికి తన చరిత్రకు ఏటుకూరి బలరామమూర్తిగారు ఎవ్వరి పరిశోధనలనూ పట్టించుకోకుండ అర్థరహితంగాను అపరిష్కృతంగాను పునః

రాబందులు - రామచిలుకలు

అనగనగా ఓహీరో. ఆయనకి 'చదువు, సంస్కారం, అందం, ఐశ్వర్యం, వినయవిధేయతలు. అన్నిటికీమించి నిజాయితీ' పుష్కలంగాఉన్నాయి- ఇందులో ఒక్క ఐశ్వర్యంతప్ప హీరోయిన్‌కు తక్కినగుణాలన్నీ ఉన్నాయి- కథాక్రమంలో నవల ఐదోపేజీలో హీరోయిను, పద్దెనిమిదోపేజీలో హీరోమనకు పరిచయమవుతారు. వాళ్ళిద్దరూ 92వ పేజీలో ఒకర్నొకరు కల్సుకుంటారు- మనం ఆశించినట్టుగానే ప్రేమించుకుంటారు- తర్వాత అపార్థాలువస్తాయి- ఆతర్వాత ఓవిలన్, ఓహాస్యగాడు, ఓవ్యాంప్ (ఈవిడ క్యాబరేడ్యాన్స్ చెయ్యకపోవడం ఓపెద్దలోపం!), బలాత్కారం, మోసం, ఫ్లాష్‌బ్యాక్, తుపాకులు, కాస్త స్కాండల్ మరింత ఫైటింగ్, సందర్భ రహిత సంస్కృత ఉపమానాలు, మోతాదుమించిన నాటకీయత, కథ ఆగిపోయినా ఆగని పాత్రల ఉపన్యాసాలు మొదలయిన అవాంతరాలన్నీ దాటుకుని వాళ్ళిద్దరు 260వ పేజీలో మళ్ళీ ఏకమవుతారు, విలన్‌కి పిచ్చెక్కడంతో 270వ పేజీలో నవల అంతమవుతుంది. ఈ కథంతటికి పూర్వరంగం - పంచాయతీరాజ్ రాజకీయాలు- పట్టణంలో పెద్దచదువు చదువుకొనికూడా ప్రజా ప్రయోజనంకోసం మన హీరో తన మామ (ఆయనే దుర్గుణాలన్నీ మూర్తీభవించిన మన విలన్) సహాయంతో గ్రామ రాజకీయాలలో ప్రవేశిస్తాడు. ఆయనకుతోడు మరో మూర్తీభవించిన ఆదర్శమూర్తి మన హీరోయిన్ తండ్రిగారు- ఇంచుమించుగా అవేఉద్దేశ్యాలతో మన హీరోయిన్

పునర్ముద్రిస్తున్న 1953 నాటి ఆంధ్రుల సంక్షిప్త చరిత్రే ప్రామాణికంకాదని చూపించి, గత ఇరవయిఅయిదు సంవత్సరాలుగా జరుగుతున్న పరిశోధనతో ఈ పుస్తకం పరిచయం ఏర్పరిస్తే సంతోషమే.

– బాలగోపాల్

References

1. An Inrtoduction to the study of Indian History, p. 295
2. K. M. Kurian (ed), India - Stateand Society అనే సంకలనంలో సయీద్‌నక్వీ వ్యాసం చూడండి.

ఆంధ్రుల సంస్కృతి - చరిత్ర - 1, కంభంపాటి సత్యనారాయణ, సంక్షిప్తానువాదం : మహీధర రామమోహనరావు హైదరాబాద్ బుక్‌ట్రస్టు ప్రచురణ (జులై 1'81), పేజీలు : 256 + 6 + xxiv (ఆంధ్రదేశ పటంతో) వెల రు. 12-00, ప్రతులకు : హై ద రా బా ద్ బుక్‌ట్రస్ట్, 3-6-694, హి మా య త్ న గ ర్ హైదరాబాద్ 500 029.